క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల, నర్సాపూర్ (జి) మండలంలోని గొల్లమాడ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖానాపూర్: పట్టణంలోని 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో ఖానాపూర్, సుర్జాపూర్, సత్తనపల్లి, పాతఎల్లాపూర్, బీర్నంది, లింగాపూర్, కడెం, బెల్లాల్ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాం సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఖానాపూర్, కడెం, పెంబి ఫీడర్లపై చెట్ల కొమ్మలను తొలగించడంతోపాటు నెలవారీ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పనులు ప్రారంభం

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని శాలివాహన (కుమ్మరి) సంఘ భవన ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో భూమిపూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నాయకుడు కట్కం రాజారెడ్డి, అర్గుల రమణ, నంద ముత్యం, బొల్ల దయాకర్, చిన్న ముత్యం,షేక్ సలీం, శాలివాహన సంఘ నాయకులు చంద్రప్రకాశ్, ముత్యం, ఇంద్రపురం మహేశ్ పాల్గొన్నారు.

ఆయుష్ ఫార్మసిస్టులను తొలగించొద్దు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ ఆస్పత్రులలో ఆయుష్ విభాగంలో విధులు నిర్వహించే ఫార్మసిస్టులను తొలగించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 65ను వెంటనే రద్దు చేయాలని ఆయుష్ ఫార్మసిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు అశోక్, రమణ, శిరీష, ఉమాదేవి, శైలజ, కళ్యాణి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


బొగ్గుట నర్సయ్య

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో అంబేడ్కర్ సంఘ భవనంలో శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యువజన సంఘం గ్రామ అధ్యక్షుడిగా బొగ్గుట నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా మహిపాల్, క్యాషియర్‌గా నర్సయ్య, కోశాధికారిగా సదానంద్, రైటర్‌గా పోశెట్టి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ తప్పనిసరి


బలరాంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: ప్రతీ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరిగా ఉంటుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శివాజీ, బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎంఏ గఫార్ అన్నారు. పట్టణంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో పని చేసే వార్డెన్ ఆడె బలరాం పదవి విరమణ పొందనున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఆయనకు సన్మానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రేమ్‌సాగర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు, ఎస్టీయూ నాయకులు భూక్యా గోవింద్, పీఈటీ సంఘం నాయకులు భూక్యా రమేశ్‌నాయక్, దాసరి నర్సయ్య, కాలేరు రాజేశ్వర్, రాజశేఖర్, ఈశ్వర్, సంతోశ్ నాయక్, అరుణ, సరిత, మౌనిక, కోల వసంత్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టి



కుభీర్: మండలకేంద్రంలోని బట్టిగల్లీ హనుమాన్ ఆలయం వద్ద నిర్మించిన పశువుల నీటి తొట్టి నిరుపయోగంగా ఉంది. ఎండాకాలం కావడంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా ఈ తొట్టిలో నీళ్లు నింపి పశువుల దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'ఈవో గౌతంను ప్రశ్నించగా తొట్టిని వినియోగంలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

ఖానాపూర్: మండలంలోని సేవ్యానాయక్‌తండాలో బీజేపీ 212వ బూత్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా మాలవత్ పాండునాయక్, ప్రధాన కార్యదర్శిగా బుక్య నితిన్‌ను ఎన్నుకున్నారు. సత్తన్‌పల్లి పంచాయతీ పరిధిలోని రాంరెడ్డిపల్లెలో బీజేపీ 211వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా నర్ర సాయన్న, కార్యదర్శిగా బీ ర్యాకరి సురేందర్ ఎన్నికయ్యారు. పార్టీ నేతలు ఉన్నారు.

సొంత భవనాల్లేక కష్టాలు..

మండలంలోని పలు గ్రామపంచాయతీలకు సొంత భవనాలు కరువయ్యాయి. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. దీంతో గ్రామసభలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రజలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న పలుచోట్ల మరుగుదొడ్డి, తాగునీరు వంటి కనీస అవసరాలు ఉండటం లేదు. అధికారులు, పాలకులు స్పందించి పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – కుభీర్


చొండిలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం


పల్సిలో అసంపూర్తిగా పంచాయతీ భవనం


అద్దె భవనంలో థార్‌కుభీర్ జీపీ కార్యాలయం

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న పంచాయతీలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, సిబ్బంది

కుభీర్ మండలంలో..

కుభీర్ మండలంలో 41 గ్రామపంచాయతీలుండగా.. ఇటీవల (కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో) రంజనితండాను సైతం ప్రత్యేక పంచాయతీగా ప్రకటించడంతో వాటి సంఖ్య 42కు చేరింది. ఇందులో 20 పంచాయతీలు పాతవి కాగా పాలన సౌలభ్యం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలోని మరో 21 గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసింది.

18 పంచాయతీలకే సొంత భవనాలు..

మండలంలో కేవలం 18 గ్రామపంచాయతీలకే సొంత భవనాలున్నాయి. మిగతా 23 గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. ఇందులో 20 గ్రామపంచాయతీల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అంకోలి గ్రామ పంచాయతీ కార్యాలయం పాఠశాల భవనంలో కొనసాగుతుండగా.. అంతర్ని, మోలా గ్రామాల పంచాయతీ కార్యాలయాలు అదే ఊరిలోని చావడిలో నిర్వహిస్తున్నారు.

అద్దె భవనాల్లో కొనసాగే పంచాయతీలు..

మండలంలో 20 గ్రామపంచాయతీల కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ధార్‌కుభీర్, బెల్గాం, బెల్గాతండా, జుమ్డా, వీర్‌గాం, బ్రహ్మేశ్వర్, శివునితండా–1, శివునితండా–2, పాత సాంవ్లి, కొత్త సాంవ్లి, సౌనా, కస్రా, సిర్‌పెల్లి, ఫకీర్‌నాయక్‌తండా, కిషన్‌నాయక్‌తండా, దావూజీనాయక్‌తండా, వర్ని, పల్సితండా–1, జామ్‌గాం, సాంగ్వి గ్రామాల్లోని భవనాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

శిథిలావస్థకు పలు పంచాయతీలు..

2012లో ఉపాధిహామీ పథకం కింద ఒక్కో పంచాయతీ భవనానికి రూ.10లక్షలు మంజూరు చేశారు. హల్దా, చొండి, పాంగ్ర, పార్డి(కె), మాలేగాం, దొడర్నా గ్రామాల్లో నిర్మించిన పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. 2023లో బెల్గాం, పల్సి గ్రామపంచాయతీలకు ఒక్కో భవనానికి రూ.16 లక్షల చొప్పున మంజూరైనా పనులు ప్రారంభించలేదు. బెల్గాంలో పంచాయతీ పాత భవనం కూల్చివేశారు. కానీ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో మళ్లీ పనులు చేపట్టలేదు. పార్డి(కె), హల్దా, చొండి గ్రామాల్లోని పంచాయతీ భవనాలు నాసిరకం నిర్మాణం కారణంగా గోడలు బీటలు వారాయి. మరోవైపు సాంవ్లి గ్రామం గడ్డెనవాగు ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో పోయింది. ఈ గ్రామస్తులకు వేరేచోట ప్లాట్లు ఇచ్చారు.. అక్కడా గ్రామం ఏర్పడింది. కానీ పంచాయతీ భవనానికి ప్లాట్ కేటాయించలేదు.

మా గ్రామానికి భవనం లేదు..



మా ఫకీర్‌నాయక్ తండాను 2019లో ప్రత్యేక గ్రామపంచాయతీగా మార్చారు. కానీ ఇంత వరకు ప్రభుత్వం పంచాయతీ కార్యాలయానికి భవనం నిర్మించలేదు. ప్రస్తుతం అద్దెభవనంలో అసౌకర్యాల నడుమ కార్యాలయం నిర్వహిస్తున్నారు.
– జాదవ్ పండిత్, ఫకీర్‌నాయక్‌తండా

నిధులు మంజూరవగానే నిర్మిస్తాం

శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాలతోపాటు అసలు సొంత భవనాలు లేని గ్రామాల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు ప్రారంభిస్తాం.
– రాజశేఖర్, పంచాయతీరాజ్ ఏఈ, కుభీర్

దళారులకు విక్రయించి మోసపోవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్


కడెం: కొండుకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండుకూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు.

గంగన్న సేవలు అభినందనీయం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. నచ్చన్ ఎల్లాపూర్ బస్టాప్ వద్ద గంగన్న ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ భూషణ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శైలజరమేశ్‌రావు, శంకర్, కోల శ్రీనివాస్, అకుల లచ్చన్న తదితరులున్నారు.

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు సత్తనపల్లి గ్రామ పీఏసీఎస్ వద్ద వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న కిశోర్‌సింగ్ కుటుంబానికి రూ.10వేలను ఆర్థికసాయంగా అందజేశారు. పడిగెల భూమన్న, అబ్దుల్ మాజిద్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, రాజునాయక్ ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని రేవోజుపేట, బుట్టాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే బొజ్జు ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ జెడ్పీటీసీ సంతపురం శారద శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కుంటాల: మండలంలోని లింబా(కె) ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 24 ఏళ్ల తర్వాత కలువడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ శుక్రవారం భూమిపూజ చేశారు. నిర్మల్ వైద్యులు దేవేందర్‌రెడ్డి, రత్నాకర్‌రావు, సుధీర్‌రెడ్డి, కపిల్, శంకర్, సాయినాథ్ ఉన్నారు.


పనులు ప్రారంభిస్తున్న శ్యాంసుందర్

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దిలావర్‌పూర్: ఎండలో ఉపాధి పనులు చేసే కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిలావర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్‌లో ఉపాధి పనులు చేసే ప్రదేశం వద్ద కూలీలకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచామని.. సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. అస్వస్థతకు గురైతే సమీపంలోని వైద్యాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఇందులో ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రాజేశ్వర్

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


ఖానాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


లక్ష్మణచాందలో క్రీస్తు సందేశం వింటున్న క్రైస్తవులు

ఖానాపూర్: పట్టణంలోని సీఎస్ఐ చర్చితోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిలలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులు పెద్ద ఎత్తున చర్చిలకు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. మస్కాపూర్ ఏఎంఎస్ చర్చిలో పాస్టర్ ప్రవీణ్ బ్రదర్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని బేతని చర్చి, సీఎస్ఐ, నిస్సీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలి

భైంసాటౌన్: పెట్రోల్‌బంకుల్లో నిర్వాహకులు తప్పనిసరిగా అగ్నిమాపక(ఫైర్‌సేఫ్టీ) నిబంధనలు పాటించాలని భైంసా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం.రవి అన్నారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు పెట్రోల్‌బంక్‌లు, వంటగ్యాస్ గోదాముల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సాయికిరణ్, గజ్జారాం తదితరులున్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

అటెన్షన్ ప్లీజ్.. గుంతలతో ముప్పు



తానూరు: మండలంలోని బెల్‌తరోడా నుంచి తానూరు వెళ్లే మార్గంలో పెట్రోల్‌బంక్ సమీపంలో డబుల్‌రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ గుంతలు కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి. అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సునీల్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్ : 84649 60600

కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్ముకోవాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంట విక్రయించి మద్దతు ధర పొందాలని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎఫ్‌ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జొన్నల పంటకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.3,371 ఉందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నవీన్, నరేందర్, పద్మాకర్, ధర్మాజీ రాజేందర్, భీంరెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని గాంధీగంజ్‌లో ఏఎంసీ ఆవరణలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. రైతుల కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలతో మాట్లాడి జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావు పటేల్, వైస్ చైర్మన్ ఫారూక్, బీజేపీ నాయకులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(కె)లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, కుంటాల పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జరాం, అప్క గజ్జారాం, రమణారావు, వెంగళరావు పాల్గొన్నారు.

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోళ్లను ఎమ్మెల్యే పి.రామారావ్ పటేల్ ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, ఆనంద్‌రావు పటేల్, సీఈవో క్రాంతికుమార్, మార్కెట్ కార్యదర్శి గంగాధర్, విఠల్, కనకయ్య, వైద్యనాథ్, మెంచు రమేశ్, గులాబ్ ఉన్నారు.


నిర్మల్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

కుంటాల: మండలంలోని కల్లూరు, పెంచికల్‌పాడ్, కుంటాల, ఓలా, లింబా(కె) గ్రామాల్లో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. లింబా(కె), కుంటాల, అంబకంటి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే పంటను కొనవద్దని అధికారులను ఆదేశించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, అప్క గజ్జారాం, రమణారావు, వెంగళరావు, నవీన్, పురుషోత్తం, కిష్టయ్య, శేఖర్‌రావు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద/సోన్ /సారంగాపూర్ : కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. లక్ష్మణచాంద మండలం పీచరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, సోన్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం, సారంగపూర్ మండలం ఆలూరు గ్రామంలో వరి, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు, కౌట్ల(బి) గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు.


కుభీర్‌లో జొన్నల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన ఏలేటి..

ముందుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. మిల్లర్ల దోపిడీని అరికట్టాలన్నారు. జొన్నలకు ప్రభుత్వం రూ.3,371 మద్దతు ధరను చెల్లిస్తుందని తెలిపారు.పదేళ్లుగా రైతులు దోపిడీకి గురయ్యారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. సోన్ మండలం సాకెర గ్రామంలో రూ.17 లక్షలతో సీసీ రోడ్లు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, పీఏసీసీఎస్ డైరెక్టర్ ముత్యంరెడ్డి, ఐకేపీ బీపీఎం రాజేశ్వర్, ఏపీఎం గంగామణి, బీజేపీ లక్ష్మణచాంద, సారంగాపూర్ మండలాల అధ్యక్షులు చిన్నయ్య, కాల్వ నరేశ్, నాయకులు రావుల రామ్‌నాథ్, నాయకులు గంగారెడ్డి, సాహెబ్‌రావు, రాజేశ్వర్, రాంశంకర్‌రెడ్డి, వీరయ్య తిరుమలచారి, విలాస్, చంద్ర ప్రకాష్‌గౌడ్, సత్యపాల్‌రెడ్డి, భూమారెడ్డి, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, ప్రమోద్, మహేష్‌రెడ్డి, ప్రకాష్, లింగారెడ్డి, లక్ష్మణ్, నానక్‌సింగ్, ముత్యంరెడ్డి, నర్సారెడ్డి, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

పరామర్శ


లక్ష్మణచాంద: మండలకేంద్రంలో శ్రీ అష్ట భుజ వేణుగోపాలస్వామి ఆలయ పూజారి పెరుమాండ్ల రమేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. అడ్వాల రమేశ్, ముత్యం రెడ్డి, చిన్నయ్య, రాజు, రావుల రాంనాథ్, పోశెట్టి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జ్ఞానేశ్వరి పల్లకి ఊరేగింపు

తానూరు: మండలంలోని బెంబర గ్రామ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఆరు రోజులగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం జ్ఞానేశ్వరి పారాయణం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా జ్ఞానేశ్వరి పారాయణం పల్లకీ శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. ఈసందర్భంగా మహరాజ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరం ఉంటూ ఆధ్యాత్మిక బాటలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న వార్‌కరి భక్తులు

యాత్రికుడికి సన్మానం


భూమేశ్‌ను సన్మానిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్: కాలినడకన పుణ్యక్షేత్రాలకు వెళ్లిన దిలావర్‌పూర్‌కు చెందిన భూమేశ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తన నివాసంలో సన్మానించారు. మండలకేంద్రానికి చెందిన కుస్తాపురం భూమేశ్.. ఇటీవల హనుమాన్ దీక్ష ధరించి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్, వారణాసితోపాటు పలు ప్రాంతాలను సందర్శించాడు. సుమారు 35 రోజులు 1306 కిలోమీటర్లు కాలినడకన తిరుగుతూ పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు విమానంలో చేరుకొని గురువారం రాత్రి గ్రామానికి వచ్చాడు. జంగం వీరేశ్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, ధనె నర్సయ్య, గంగారెడ్డి, కుస్తాపురం రమేశ్, కిష్టయ్య, ముత్యం, సుభాశ్ పాల్గొన్నారు.